అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- పోతుగల్ పీహెచ్‌సీ నూతన భవనంలో సేవలు ప్రారంభం

పోతుగల్ పీహెచ్‌సీ నూతన భవనంలో కొబ్బరికాయ కొట్టి సేవలు ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ముస్తాబాద్, ఫిబ్రవరి 9 : అంకిత భావంతో పనిచేసి మెరుగైన సేవలు అందించినపుడే దవాఖానపై ప్రజల్లో విశ్వాసం కల్గుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండలంలోని పోతుగల్ గ్రామంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనంలో సేవలను కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సిబ్బంది మెరుగైన సేవలు అందించి హాస్పిటల్‌కు పేరు తేవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వేములవాడలో పూర్తిస్థాయి వైద్యులను అందుబాటులో ఉంచామని ఆశ కార్యకర్తలు సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా, మండలంలోని పోతుగల్ గ్రామస్తులు, నాయకుల విన్నపం మేరకు 15వ ఫైనాన్స్ నిధులతో గత ప్రభుత్వం నూతన భవనం నిర్మించింది. అనంతరం కలెక్టర్ పోతుగల్‌లోని ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, విద్యార్థుల గదులు, స్టోర్‌రూమ్, కిచెన్ గదిని పరిశీలించి సూచనలు చేశారు. అలాగే, పోతుగల్ సహకార సంఘం గోదాంను కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న ఎరువులు కొనుగోలు, విక్రయాల రిజిస్టర్ పరిశీలించారు. అలాగే ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. స్థానిక నాయకుడు తోట ధర్మేందర్‌తోపాటు నాయకులు కలెక్టర్‌కు విన్నపంతో ఎస్సీకాలనీలో పాఠశాల పాత భవనాన్ని పరిశీలించారు. ఎంపీడీవో, అధికారులతో మాట్లాడి స్కూల్ భవనాన్ని నిర్మించాలని ఆదేశించారు. ఇక్కడ ఎంపీడీవో బీరయ్య, తహసీల్దార్ సురేశ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఈఈ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ గీతాంజలి, ఏఈలు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రతి నిర్వాసిత కుటుంబానికీ రూ.5 లక్షలివ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్

బోయినపల్లి మండలంలోని నీలోజిపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

వేములవాడ, ఫిబ్రవరి 9(బోయినపల్లి): మధ్యమానేరు నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఐదు లక్షలా నాలుగు వేల రూపాయలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామ శాఖ సమావేశం మండల కార్యదర్శి గురుజాల శ్రీధర్ అధ్యక్షతన జరుగగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మధ్యమానేరులో భూములు కోల్పోయిన నిర్వాసితులు, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా ఇక్కడ ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా ఇప్పటికీ పరిశ్రమలకు సంబంధించిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఉపాధి లేక అప్పుల పాలవుతున్న ముంపు గ్రామాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని మధ్యమానేరు నిర్వాసితులకు అండగా నిలబడి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అంతకుముందు జలాశయంలో భూములు కోల్పోయిన, రైతులను జిల్లా సీపీఎం పార్టీ కార్యదర్శి మూషం రమేశ్ కలిశారు. కార్యక్రమంలో నీలోజిపల్లె సీపీఎం నాయకులు ఎర్ర నాగరాజు, సింగిరెడ్డి శంకర్, అనుముల రవి, ఆవుల మల్ల య్య, ఆవుల రాములు, వెంకట్ రెడ్డి, లింబాద్రి, కడుదుల రవితదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

పాస్‌పోర్టు పోయింది

★చెన్నమల్ల సంతోష్ S/o. వేణుగోపాల్, గ్రా|| రాజారాంపల్లి, మం|| పెగడపల్లి జగిత్యాల జిల్లా. నా పాస్‌పోర్టు నాయొక్క ద్విచక్ర వాహనం పై రాజారాంపల్లి నుండి పెగడపల్లికి వెళ్తుండగా మార్గ మధ్యలో పడి పోయింది. పాస్ పోర్ట్ నెం|| T6143455 దొరికిన వారు సంప్ర|| 9550063982, 7095289534 (తగిన పారితోషికం ఇవ్వబడును.)

NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

డిగ్రీ కళాశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

- వాచ్‌మన్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని గాయత్రీ డిగ్రీ కళాశాలలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా డిజిటల్ ల్యాబ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి కంప్యూటర్లు, ఫర్నీచర్ దగ్ధమైనట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం ఉదయం 5 గంటలకు కళాశాల నుంచి దట్టమైన పొగలు వస్తుండడాన్ని గమనించిన వాచ్‌మన్ నర్సింలు ప్రిన్సిపాల్ నాగేందర్‌రావుకు ఫోన్‌చేసి సమాచారమిచ్చాడు. దీంతో సిబ్బందిని అలర్ట్ చేసి ఫైర్‌సేఫ్టీ పరికరాలతో మంటలను సకాలంలో చల్లార్చారు. కానీ అప్పటికే రూ.2లక్షల విలువైన ఫర్నీచర్, రెండు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, ఎలక్ట్రిక్ పరికరాలు కాలిబూడిదైనట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

మహాసభ కరపత్రం ఆవిష్కరణ

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 9 :వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో ఈనెల 21న జరిగే భవన కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభ కరపత్రాన్ని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సెంట్రింగ్, సుతారి, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, మార్బుల్, అన్ని రకాల బిల్డింగ్ రంగ కార్మికులు సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. 55 ఏండ్లు నిండిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు, యాక్సిడెంట్‌కు రూ.10 లక్షలు, మ్యారేజ్‌కి రూ.1లక్ష, డెలివరీకి రూ.50 వేలు కార్మికులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వేములవాడలో జరిగే మహాసభను విజయంతం చేయాలని కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లచ్చయ్య, అంజయ్య, మల్లేశం, రామస్వామి, రాములు, నాగరాజు, మల్లేశం, నర్సయ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నివారణ దినోత్సవం వాయిదా

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: ఈ నెల పదో తేదీన జరగాల్సిన నులిపురుగు నివారణ దినోత్సవం వాయిదా వేసినట్లు వైద్యాధికారి సరియా అంజుమ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ ఆదేశాలతో జిల్లా వైద్యాధికారి ఎస్ రజిత ఉత్తర్వులను జారీ చేసినట్లు చెప్పారు. మళ్లీ ఎప్పుడనేది త్వరలోనే తేదీని ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు.

వామ్మో.. వీధి కుక్కలు

- ఎలర్జీతో గ్రామ సింహాలు సతమతం
- జనావాసాల్లోనే తిరుగుతున్న కుక్కలు
- ప్రబలుతున్న చర్మవ్యాధులు
- జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కనగర్తిలో గుంపులుగా వైరస్ సోకిన కుక్కలు

మామిడిపల్లిలో రాత్రి వేళ కుక్కలు

బావుసాయిపేటలో వ్యాధి సోకిన కుక్క

కోనరావుపేట, ఫిబ్రవరి 9: పల్లెల ప్రజలను గ్రామ సింహాలు బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి సమయాన దొంగల బారి నుంచి ప్రజలను అప్రమత్తం చేసే గ్రామసింహాలు ఇప్పుడు జనాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఓ వైపు వీధుల్లో తిరుగుతూ కరవ డం, మరోవైపు వింత వ్యాధులు సోకి బాధపడుతూ ప్రజలకు జంకుపుట్టిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో గ్రామ సింహాలతో వచ్చిన కష్టం తో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వీధి కుక్కలకు సోకుతున్న చర్మవ్యాధులతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని, జిల్లాలోని ఎక్కడ చూసినా వీధుల్లో వ్యాధులు సోకిన కుక్కలే దర్శనమిస్తున్నాయని భయందోళన చెందుతున్నారు. కుక్కలకు ఒంటిపై బొచ్చు ఊడిపోవడం, దుద్దర్లు రావడం, చిన్న చిన్న పుండ్లు ఏర్పడుతూ, శరీరమంతా చిట్లిపోతున్న కుక్కలే అగుపిస్తున్నాయి. ఈ క్రమంలో కుక్కలు దురదతో సహనం కోల్పోయి అవి తోటి కుక్కలతోపాటు చిన్నారులతోపాటు పెద్దలపై దాడులు చేస్తున్నాయి. ఇక దురద సోకి చర్మం ఊడేలా ఉన్న కుక్కలు కరిస్తే ఎలాంటి వ్యాధులకు గురవుతామోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ఆహారమే విషపూరితం

ప్రధానంగా వీధుల్లో తిరిగే కుక్కలు ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ చెత్తకుప్పలపై ఆహారం తినడం, జంతు కళేబరాలను పీక్కుతినడం వల్ల కుక్కల శరీరంలో మార్పులు వస్తున్నాయని పశువైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా కుక్కలు ఎక్కువగా కోళ్ల ఫారాలు, చికెన్ సెంటర్ల వద్ద కుక్కలు ఎక్కువగా తిరుగుతూ కోళ్ల వ్యరాలు తింటున్నాయి. గ్రామాల్లో చికెన్ సెంటర్ల వద్దనే పేగులు, పచ్చి మాంసం వ్యర్థాలు పడేయడంతో బ్యాక్టీరియా ఉత్పన్నం కాగా కుక్కలు వాటిని తిని రోగాల బారినపడుతున్నాయి. ఇలా కుక్కలు ఎక్కువగా వ్యాధుల బారిన పడి వీధుల్లో తిరుగుతున్నాయి. ఇక గ్రామాల్లో ఇంటి వద్ద కూర్చుండే గద్దెలపై, ప్రధాన రోడ్లపై, ఇంటి ఆవరణలో కుక్కలు నిద్రిస్తూ వాటిపై మూత్ర విసర్జన, వాంతులు చేయడం చేస్తున్నాయి. దీంతో ఖాళీ సమయాల్లో ప్రజలు గద్దెలపై కూర్చుండడం, చిన్నారులు ఆడుకునే సమయంలో వారికి వ్యాప్తి చెందుతోంది. ఇండ్లలో ఎవరూ లేని సమయంలో బయట ఉన్న నీళ్ల కుండీల్లో సైతం కుక్కలు నీటిని తాగడంతో వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. ఇటీవల కనగర్తి గ్రామంలో చిన్నారి చేపూరి శ్రీమేథకు కూడా తన ఇంటి ఆవరణలో తిరుగుతున్న కుక్కల ద్వారానే బ్రూసెల్లా ఇథిపికల్ సోకినట్లు వైద్యులు తెలిపారు.

రోగ నివారణకు చర్యలు శూన్యం

వీధుల్లో వ్యాధి బారిన పడిన కుక్కలకు చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. దీంతో వ్యాధి బారిన పడిన కుక్కలు పూర్తిగా ఆరోగ్యం క్షీణించిన చనిపోకపోవడంతోపాటు ఆరు నెలలపాటు వైరస్ ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో పశు వైద్యశాలలో మందులు సరఫరా లేక చికిత్స అందించే పరిస్థితి లేకుండా పోయింది. గతంలో కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేసేవారు. ఇటీవల కాలంలో అలాంటి కార్యక్రమాలు కనుమరుగవడంతో నివారణ చర్యలు శూన్యమైపోయాయి. తద్వారా కుక్కలు వ్యాధిన బారిన పడి నెలలపాటు అవస్థలు పడుతూ జనావాసాల్లో తిరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాధి బారినపడిన కుక్కలను దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే ప్రజలకు శాపం

గ్రామంలోని అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మా కూతురు శ్రీమేథ(4)కు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో సిరిసిల్లలోని ఓ దవాఖా నకు తరలించాను. అక్కడ రెండు రోజుల పా టు చికిత్స చేయించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించాను. కొంత మేర జ్వరం తగ్గుముఖం పట్టడంతో పాపను ఇంటికి తీసుకువచ్చాను. కానీ తిరిగి జ్వరం ఎక్కువ కావడంతో ఏంటో అర్థం కాలేదు. దీంతో వెంటనే హైదరాబాద్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు బ్రూసెల్లా ఇథిపికల్ వైరస్ వచ్చినట్లు నిర్ధారించారు. ఇదంతా అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగింది. మా ఇంటి సమీపంలో చికెన్ సెంటర్ నిర్వాహకుడు కోళ్ల పచ్చి వ్యర్థాలను, మాంసం ముక్కలను చెల్లాచెదరుగా పడేయగా కుక్కలు వాటిని తింటూ వ్యాధుల బారిన పడ్డాయి. ఈవిషయమై గ్రామ పంచాయతీలో పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నివారణతోపాటు చికెన్ సెంటర్ నిర్వాహకులకు తగిన సూచనలు చేయాలి

-చేపూరి రాజు, కనగర్తి(కోనరావుపేట)

నివారణ చర్యలు తీసుకుంటాం

గ్రామాలలో వీధి కుక్కలు చెత్త కుప్పలపై తిన డం, జంతు కళేబరాలను తినడంతో వైరస్ సోకే అవకాశం ఉంది. పచ్చి మాంసం వ్యర్థాల ద్వారానే ఎక్కువగా వ్యాధి ప్రబలుతోంది. గ్రామాల్లోని కుక్కలకు ఇలాంటి వ్యాధులు ప్రబలి ఒంటిపై బొచ్చు ఊడిపోవడం, దుద్దర్లు రావడం, చిన్న చిన్న పుండ్లు ఏర్పడుతాయి. వ్యాధి నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి గ్రామాలలో వ్యాధి బారిన పడిన కుక్కలకు ఇంజెక్షన్లు వేయించేందుకు కృషి చేస్తాం.

-పొట్లపల్లి సాహితీరావు, పశువైద్యాధికారి, కోనరావుపేట

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9: సిరిసిల్ల పట్టణ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సిరిసిల్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో అధ్యక్షుడిగా వొజ్జల అగ్గి రాములు, ఉపాధ్యక్షులుగా కుల్ల సత్తయ్య, దుమాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇప్పపూల లక్ష్మణ్, కోశాధికారిగా అయిలి శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా తోట శంకర్, సహాయ కార్యదర్శిగా చల్ల రవీందర్, సంయుక్త కార్యదర్శిగా బత్తుల భూమేశ్, కార్యవర్గ సభ్యులుగా శీలం రాజు, లింగంపల్లి సతీశ్, పల్లికొండ నర్సయ్య, సొక్కి శ్రీనివాస్, కాశెట్టి పరశురాములు, ఇప్పపూల రాజు, కూస మహేశ్, బల్యాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు నీలి శంకర్, గడ్డం నర్సయ్య, బొప్ప దేవయ్య, కల్లూరి రాజు, ఎరుకల సూర్యప్రకాశ్ అభినందించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు, తదితరులున్నారు.

మిత్రుల బాసట

చందుర్తి, ఫిబ్రవరి 9: మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన గరుడ మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం 2000-2001 పదో తరగతి మిత్రులు బాసటగా నిలిచారు. మహేందర్ కుటుంబ సభ్యులపై రూ.35 వేల నగదు డిపాజిట్ చేశారు. ఇక్కడ గూడూరి రవీందర్, అవారి మనోహర్, వరికెల కిష్టస్వామి, గొళ్లపెల్లి శ్రీనివాస్, పెంటల రమేశ్, లోకోజు సతీశ్, రాజు పూర్వ విద్యార్థులున్నారు.

పీఆర్టీయూ ఆవిర్భా వ వేడుకలు

తెలంగాణ చౌక్, ఫిబ్రవరి 9: సిరిసిల్ల పట్టణంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సం ఘం ఆవిర్భావ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు సంఘ స్థాపకుడు సామల యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయల ప్రయోజనాల కోసం పీఆర్టీయూ ఎనలేని కృషి చేసిందన్నారు. ఇక్కడ నాయకులు ఎడ్ల కిషన్, యాదగిరి, ప్రభాకర్, షఫీ, మహేశ్, జక్కని నవీన్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

పాత్రికేయులు వారధులు

- టీయూడబ్ల్యూజేహెచ్ 143 మహాసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ముందుండి పోరాడుతా : అల్లం నారాయణ

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న తెలంగాణ ప్రెస్ అకాడమీ తొలి చైర్మన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే 143 సంఘం నాయకులు

వేములవాడ, ఫిబ్రవరి 9: పాత్రికేయులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. పాత్రికేయులు ఒక్కొక్కరు 100 మందితో సమానమని, సమాజంలో అణచివేతకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాపోరాటాలకు అండగా ఉంటూ నిజాలను నిర్భయంగా సమాజానికి అందిస్తున్నారని కొనియాడారు. వేములవాడలోని మహదేవ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే-143) కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల మహాసభ నిర్వహించారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ తొలి చైర్మన్ అల్లం నారాయణతో కలిసి విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. తన రాజకీయ జీవితంలో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని, తన గెలుపులో భాగస్వామ్యమైన మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే మీ కలం ద్వారా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అల్లం నారాయణ మాట్లాడుతూ, తాను ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో పాత్రికేయుల ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపానని గుర్తు చేశారు. ఇక ముందు కూడా పాత్రికేయుల సమస్యలపై ముందుండి పోరాడుతానని స్పష్టం చేశారు. ఇళ్లస్థలాలు, అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు తదితర వాటిపై అర్హులైన జర్నలిస్టులకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. పాత్రికేయులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతకు ముందు టీయూడబ్ల్యూజేహెచ్143 రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన లాయక్ పాషాను అభినందించారు.

బాధిత కుటుంబాలకు సుంకె పరామర్శ


అనంతపల్లిలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

వేములవాడ, ఫిబ్రవరి 9(బోయినపల్లి): బోయినపల్లి మండలంలో మృతి చెందిన కుటుంబాలను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదివారం పరామర్శించారు. తడగొండ గ్రామానికి చెందిన రెండ్ల బాపన్న, అనంతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్సీసెల్ గ్రామాధ్యక్షుడు రోమాల తిరుపతి తల్లి కనుకమ్మ, అలాగే గ్రామానికి చెందిన బోస్ పోచవ్వ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఇక్కడ తడగొండ మాజీ సర్పంచ్ చిందం రమేశ్, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఆజ్జు, మాజీ ఉప సర్పంచ్ పర్స మల్లేశం, సోషల్ మీడియా కన్వీనర్ కమల్‌గౌడ్, అలువాల రాజయ్య, మల్లారపు చందు, పొన్నం తిరుపతి, బుర్ర రాజు, రాకేశ్, జంగ ఓదెలు,వినయ్, చంటి, గంగాధర అంజయ్య, లచ్చయ్య, మురళి, కన్నం హన్మయ్య తదితరులున్నారు.

ఆరె సంఘం నూతన కార్యవర్గం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 : మండలంలోని కేశన్నపల్లి గ్రామంలో ఆదివారం ఆరె కుల సంక్షేమ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఆరె సంఘం గ్రామ సభ్యులు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడిగా వజ్జపల్లి దేవ రావు, అధ్యక్షుడిగా వజ్జపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వజ్జపల్లి హనుమంతు, వడిజ అనిల్, ప్రధాన కార్యదర్శిగా వడిజ రాజు, కార్యదర్శిగా వజ్జపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా వజ్జపల్లి శ్రీనివాస్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామన్నారు.

రైతు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలో సోమవారం పురగిరి క్షత్రియ పెరిక మండపంలో నిర్వహించే రైతు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు సంఘం మండలాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ నిపుణుల ఆధ్వర్యంలో ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తారని తెలిపారు. రైతులు పాల్గొని వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనలు, పంటల మార్పిడి పద్ధతులపై నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ వారికెల బాబు రావు, లచ్చిరెడ్డి, రేషం రామస్వామి, తిరుపతి, భూమరాజ్, బొల్లు తిరుపతి, మర్రిరెడ్డి, తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేగావత్ తిరుపతి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి, ఫిబ్రవరి 9: మండల కేంద్రం, గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేగావత్ తిరుపతి అన్నారు. ఆదివారం రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పార్టీ మండలాధ్యక్షుడు దేగావత్ తిరుపతి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పరిధిలోని 428/2, 428/3, 428/4 మూడు సర్వే నంబర్లలోని ఎకరా ముప్పై రెండు(1-32) గుంటలు గల ప్రభుత్వ భూమిలో రుద్రంగి మండల పంచాయతీ ఆఫీసర్, రుద్రంగి గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాజకీయ అండదండలతో ప్రైవేట్ వ్యక్తులకు ఇంటికి పర్మిషన్లు జారీచేస్తూ డబ్బులు దండుకుంటూ ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం చేశారని గ్రామానికి చెందిన పిట్టల నరేశ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారన్నారు. ఈ పిల్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హైకోర్టు జడ్జి రాజన్న సిరిసిల్ల జిల్లా డీపీవోను ఆ భూమికి సంబంధించి సమగ్ర విచారణ చేపట్టి 15 రోజుల్లో రిపోర్టు ఫైల్ చేయాలని ఆదేశించిందన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి బస్టాండ్ ఏరియాలో విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా పక్కాగా సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను అరికట్టి వారిపై చర్యలు తీసుకునేంత వరకు రుద్రంగి ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అభివృద్ధి కోసం ప్రభుత్వ భూమి అవసరం ఉన్నందున ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని అక్ర మ నిర్మాణాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు గంగం మహేశ్, మాడిశెట్టి ఆనందం, చెప్యాల గణేశ్, ఉప్పులూటి గణేశ్, దుబ్బ రవి, కొడగంటి శ్యామ్, గొళ్లెం నర్సింగ్, నరేశ్, ఆకుల గంగాధర్, తర్రె గంగారెడ్డి, పెద్దులుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యం స్వచ్ఛంద సంస్థల బాధ్యత

- విప్ ఆది శ్రీనివాస్

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : సమాజాన్ని చైతన్యం చేయాల్సిన బాధ్యతను స్వచ్ఛంద సంస్థలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం ఉంటుందన్నారు. సమాజాన్ని చైతన్యపరిచి మంచి మార్గంలో నడిపించేలా చూడాలన్నారు. హెల్పింగ్ హార్ట్స్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సిరిసిల్లలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేదలకు విద్య, వైద్యం వంటి కార్యక్రమాలు అందించి స్ఫూర్తిదాయకంగా నిలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో ప్రముఖ సైకాలజిస్టు పున్నం చందర్, సంస్థ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి దాసరి తిరుమల, మాజీ కౌన్సిలర్ డాక్టర్ కుడిక్యాల రవికుమార్, చిలుక రమేశ్ తదితరులున్నారు.

గురుకుల విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9: గురుకుల విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనలో 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో వందలాది ఫుడ్ పాయిజన్ కేసులయ్యాయని విమర్శించారు. కల్తీ ఆహారం పెడితే అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరికలు మాటలకే పరిమితయ్యాయన్నారు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గురుకులాల తీరు ఉందని, రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటడంలేదని ఎద్దేవా చేశారు. దవాఖానపాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కోడం వెంకటేశ్, గాజుల మహేశ్, శ్రీకాంత్, తిరుపతి, ఉమేశ్, లక్ష్మణ్, రాజు, ఉపేంద్ర, తరుణ్ ఉన్నారు.

బూడిదలో పోసిన పన్నీరులా బీసీ కులగణన

- బీసీ జనాభా తగ్గడం వెనుక కుట్ర
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9: అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు గమనిస్తే బీసీ కులగణన బూడిదలో పోసిన పన్నీరును తలపిస్తున్నదని బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్లలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను మభ్యపెట్టి వంచిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన బీసీలకు అమృతంలా ఉంటుందని భావిస్తే చివరికి ఎందుకూ ఉపయోగపడని విధంగా అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో 51శాతం ఉన్న బీసీల జనాభా కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో చేసిన సర్వేలో 46శాతానికి ఎలా తగ్గిందని ప్రశ్నించారు. దీనికి వెనుక పెద్ద కుట్రనే దాగి ఉందని ఆరోపించారు. బీసీ కులాలను నట్టేట ముంచే విధంగా రేవంత్‌రెడ్డి తీరు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెప్పడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడంలేదన్నారు. బీసీ కులగణన ప్రారంభించినప్పుడు పండుగ వాతావరణం ఉంటుందని భావించిన వారంతా ఇప్పుడు నిరుత్సాహంగా ఉన్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే పునఃసమీక్షించి బీసీ లెక్కలను సరిచేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే తాము చేపట్టే నిరసన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేశ్ యాదవ్, తడక కమలాకర్, తోట రాములు, బచ్చు ప్రసాద్, తిరుపతి, దుబాల కొండయ్య, సామల తిరుపతి, కత్రోజు శంకర్, కస్ప రవీందర్, చిందం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.